క్లుప్తంగా

బహుజన భరోసా సభ విజయవంతం చేయాలి

కోనరావుపేట(వేములవాడ): అసమానతలు, అణచివేతల పాలన నుంచి విముక్తి కల్పించేందుకు నిర్వహించే బహుజన భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం కోరారు. శనివారం కోనరావుపేటలో మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పేదల బతుకులు బాగుపడుతాయనుకుంటే మరింత దారుణంగా తయారయ్యాయని అన్నారు. మరోసారి తెలంగాణను దొరల చేతికి అప్పగించకుండా వారు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యపర్చాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆయన వెంట జిల్లా నాయకులు నందూనాయక్, స్వామి గౌడ్, బొడ్డు మహేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ

వేములవాడ: వేసవి సెలవులు కొనసాగుతుండటంతో వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నిత్యం విద్యార్థులకు మాస్టర్ ఎంఏ మన్నాన్ ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకొచ్చి ప్రాక్టీస్ చేయిస్తున్నారు. శనివారం కరాటే శిక్షణలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు రజక సహకార సంఘం అధ్యక్షుడు మారుపాక శంకర్ తెలిపారు. గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు

కోనరావుపేట : మండలంలోని నిజామాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వైస్ ఎంపీపీ సుమలత, వార్డు సభ్యులు మంగ, లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

ముస్తాబాద్ : మండలకేంద్రానికి చెందిన నిరుపేద భట్టు బాబాయి, నర్సయ్య దంపతుల కూతురు వివాహానికి బీజేపీ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ శనివారం పుస్తె మెట్టెలను అందజేశారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ కనమెని చక్రధర్ రెడ్డి క్వింటాల్ బియ్యం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మీస శంకర్, సంజీవ్, కృష్ణ, బండి శ్రీకాంత్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పనుల పరిశీలన


కూలీల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్లలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో మీర్జా శనివారం పరి శీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీఒక్కరూ ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మన ఊరు – మన బడి పనులతో పాటు, వైకుంఠధామాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ స్రవంతి, తదితరులున్నారు.

రుద్రంగి శివారులో...

చందుర్తి : రుద్రంగి శివారు అటవీ ప్రాంతంలోని చీవురు దుబ్బ వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో శంకర్ నాయక్ శనివారం పరిశీలించారు. నీటి కుంటల పనులను పరిశీలించి, కూలీల హాజరును తనిఖీ చేశారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్‌కు పలు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై చర్చకు సిద్ధం

ముస్తాబాద్: ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్ రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు ధాన్యం కొనుగోళ్లపై చర్చకు రావాలని సవాల్ విసిరారని, పోతుగల్, ఆవునూర్ ఇతర కేంద్రాల్లో టార్పాలిన్లు ఇవ్వడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్యాక్స్ చైర్మన్ బీజేపీ నాయకులను విమర్శిస్తూ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతుల సమక్షంలో తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, చైర్మన్ చర్చకు రావాలని ప్రతి సవాల్ చేశారు. ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, సంజీవ్, గోపి, అంజగౌడ్, శంకర్, రాంగోపాల్, సత్యం, దేవేందర్, ఉపేంద్ర, శ్రీనివాస్ తదితరులున్నారు.


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు


కుంగ్‌ఫూ నేర్చుకుంటున్న విద్యార్థులు

సమ్మర్ స్పెషల్ క్యాంప్స్

- క్రీడలు, సంగీతం, తదితర వాటిలో శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

సండే స్పెషల్

సిరిసిల్ల అర్బన్ : వేసవి సెలవులు వచ్చాయంటే విద్యార్థులకు ఎక్కడా లేని ఉత్సాహం కలుగుతుంది. సంవత్సరం పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టి, చదువు, హోంవర్క్, పరీక్షలతో బిజీబిజీగా ఉండే విద్యార్థులు పలు క్రీడలపై శిక్షణ తీసుకుంటున్నారు. వేసవిలో నిర్వహిస్తున్న పలు శిబిరాల్లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను శిక్షణ శిబిరాలకు పంపేందుకు ప్రోత్సహిస్తున్నారు. సంగీతం, డ్యాన్స్, కరాటే, యోగా, మార్షల్ ఆర్ట్స్, చిత్రలేఖనం, చేతిరాతపై శిక్షణ, పలు క్రీడలను నేర్చుకునేందుకు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చిన్నారులు, విద్యార్థులతో పాటు యువకులు, మహిళలు వేసవిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఏకాగ్రతకు యోగా..

చదువులో రాణించాలన్నా, చురుగ్గా ఉండాలంటే ఏకాగ్రత అవసరం. పిల్లలు శారీరక, మానసిక, సామాజిక వికాసం కోసం తల్లిదండ్రులు యోగా శిక్షణ కేంద్రాలకు పంపిస్తున్నారు. తపవన యోగ కేంద్రం నిర్వాహకుడు ఎలిగేటి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా అభ్యసనాలు నేర్పిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అనుభవం గల శిక్షకులతో యోగాసనాలను చిన్నారులకు నేర్పిస్తున్నారు. తల్లిదండ్రులు దృష్టిసారించి తమ పిల్లలను శిక్షణకేంద్రాలకు పంపిస్తున్నారు.

ఆత్మ రక్షణకు మార్షల్స్ ఆర్ట్స్

స్వీయ రక్షణకు మార్షల్‌ఆర్ట్స్, కరాటే, కుంగ్‌ఫూలో శిక్షణ పొందేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. బాలురతో పాటు బాలికలు కూడా నేర్చుకునేందుకు ముందుకొస్తున్నారు. తల్లిదండ్రులు సైతం ప్రోత్సాహం అందించడంతో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ శిక్షణ పొందుతున్నారు. పట్టణంలోని కుంగ్ ఫూ మాస్టర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో విద్యార్థులు తర్ఫీదు తీసుకుంటున్నారు.

సంగీతంపై ఆసక్తి

పెద్ద పట్టణాలకే పరిమితమైన సంగీత శిక్షణ కేంద్రాలు సిరిసిల్ల పట్టణంలో వెలిశాయి. సంగీతం పట్ల ఆసక్తి కలిగిన చిన్నారులను గుర్తించిన తల్లిదండ్రులు సంగీత సాధనకు వారిని ప్రోత్సహిస్తున్నారు. పట్టణంలోని ఆర్కేమిత్ర ఫౌండేషన్ స్వరాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతాన్ని నేర్పిస్తున్నారు. వేసవి సమయాన్ని వృథా చేయకుండా చిన్నారులు సంగీతం ఆలపిస్తున్నారు.


సంగీతం ఆలపిస్తున్న చిన్నారులు

సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరం

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల దృష్ట్యా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులతో పాటు పెద్దవారు సైతం ఈ శిక్షణ కేంద్రానికి తరలివస్తున్నారు. గ్రామీణ క్రీడగా ప్రాచుర్యం పొందిన కబడ్డీని నేర్చుకునేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. కబడ్డీతో పాటు పలు క్రీడలు నేర్పిస్తున్నారు.

రైతులకు పరిహారం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

- పెండింగ్ బిల్లులు ఇప్పించాలి
- మండల సభలో సభ్యుల డిమాండ్

ఎల్లారెడ్డిపేట : అకాలవర్షాలు, వడగళ్లతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అధికారులు సర్వేలతో సరిపెట్టకుండా రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పిల్లి రేణుక అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. పంటల నష్టంపై వేగవంతంగా సర్వేలు చేసి పరిహారం అందించాలని సర్పంచ్‌లు సునీత, పెంటయ్య, రవీందర్, బాబు కోరారు. 3,800 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలుండగా, 2500 ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలు అందజేశారని సభ్యులు ఆరోపించారు. పోతిరెడ్డిపల్లికి మిషన్ భగీరథ పైపులైన్‌ను వెంటనే పూర్తి చేయాలని ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు డిమాండ్ చేశారు. వెంకటాపూర్, అగ్రహారం, గుండారం, రాజన్నపేట గ్రామాల్లో విద్యుత్ లూజ్‌వైర్లతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వెంటనే సరిచేయాలని సర్పంచ్‌లు మునిగె అమృత, కోల అంజమ్మ, ముక్క శంకర్, వంకర్‌నాయక్ తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. మండల కేంద్రానికి అగ్నిమాపక కేంద్రం మంజూరైనా ఏర్పాటు చేయడం లేదని వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్ అన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని సభ్యులు కోరారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రాచర్లగుండారంలో 400 ఎకరాల పోడు భూములను సర్వే చేశామని, పది రోజుల్లో అర్హులైన వారికి పట్టాలు అందిస్తామని తహసీల్దార్ జయంత్‌కుమార్ అన్నారు. రాజన్నపేటలో డబుల్‌బెడ్ రూంలకు లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, వైస్ ఎంపీపీ భాస్కర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఏవో భూం రెడ్డి, పీఆర్‌డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ పృథ్వీధర్, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో చిరంజీవి, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వీఓఏల సమ్మె


చందుర్తిలో సమ్మె చేస్తున్న వీఓఏలు

చందుర్తి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు శనివారం సమ్మెకు దిగారు. సంఘం అధ్యక్షురాలు స్వరూప, ప్రధాన కార్యదర్శి వినోద, మమత, పద్మ, అజీదా, గంగ, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి: వేతనాలు పెంచాలని కోరుతూ వీఓఏలు సమ్మె బాట పట్టారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట మండలానికి చెందిన వీవోఏలు నిరసన వ్యక్తం చేశారు. వేతనం పెంచాలని, ప్రమాదబీమా రూ. 5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలానికి చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వేములవాడరూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు శనివారం వేములవాడలో శాంతియుత నిరవధిక మెరుపు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గౌరవ వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని పేర్కొన్నారు.రూ. 10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అర్హులైన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. లక్ష్మీ, దుర్గవ్వ జలజ, పిట్టల సుమలత, గుండేటి రాజేశ్వరి, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మీ చెక్కులను సర్పంచ్ పాశం సరోజన శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ పథకం నిరుపేద ఆడ బిడ్డలకు వరంగా మారిందన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, దేవిరెడ్డి, పాటి దేవయ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న నాయకులు

'డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయడంలో మంత్రి కేటీఆర్ స్పందించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఏటా 2వేల మంది ఇంటర్ పూర్తి చేస్తున్నారని, ఇందులో సగం మంది నిరుపేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చదివే ఆర్థిక స్థోమత లేక ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చి విద్యార్థులను మోసం చేశారని, వెంటనే కళాశాల మంజూరు చేయాలని కోరారు. నాయకులు నాగరాజు, ప్రవీణ్, ఆదిత్య, అరవింద్, మనోహర్, మొగిలి, వెంకటేశ్, చరణ్, రిజ్వాన్ రాకేశ్, సిద్ధు, నిఖిల్, శివ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ ఒక ప్రకటనలో కోరారు. ఇల్లంతకుంట మారుమూల ప్రాంతం కావడంతో ఇంటర్మీడియట్ వరకే ఉందని, డిగ్రీ చదవాలంటే సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.



హనుమాన్ శోభాయాత్ర

గంభీరావుపేట: మండలకేంద్రంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. రావిచెట్టు హనుమాన్ దేవాలయం నుంచి శోభాయత్ర బయలుదేరి పురవీధుల గుండా కొనసాగింది.

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'గిరి వికాస్'

చందుర్తి : గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధిహామీ పథకంలో గిరి వికాస్ పథకాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు ఎంపీడీవో పత్తి రవీందర్ అన్నారు. మండలంలోని దేవునితండాలోని భూక్యా భిక్య అనే లబ్ధిదారుడి వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ లైన్ పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ పథకంలో విద్యుత్ లైన్ పనులతో పాటు, బోరు మోటారు, భూమి లెవలింగ్ పనులు చేపట్టేందుకు రూ.2.50 లక్షలు మంజూరుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్ రావు, సనుగుల, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు జలగం కిషన్‌రావు, శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు కమలాకర్, ఎంపీవో ప్రదీప్‌కుమార్, ఉపాధిహామీ ఏపీవో రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో కమిటీ సభ్యులు తదితరులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో శనివారం రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా ఉదయం ఆలయ ప్రవేశం, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యావచనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ పూజలు చేశారు. ఆదివారం పోచమ్మ, మడేలేశ్వర స్వామి బోనాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. సంఘం అధ్యక్షుడు దొమ్మాటి భూపతి, సభ్యులు రాజయ్య, పర్శరాములు, రాజు, దేవయ్య, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'గోపా' కార్యవర్గానికి సన్మానం


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న జిందం కళ

సిరిసిల్ల టౌన్: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సన్మానించారు. శనివారం గోపా ప్రతినిధులు చైర్‌పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలువగా వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గోపా అధ్యక్షుడు అమరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విక్రుతి లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి బాలగౌడ్, తదిదతరులున్నారు.

పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తాటు కనుకయ్యను చైర్‌పర్సన్ జిందం కళ దంపతులు పరామర్శించారు.

ఎల్‌వోసీ అందజేత

ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాచర్ల గుండారం గ్రామానికి చెందిన మూడవత్ దేవయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో 20 రోజులుగా చికిత్స పొందుతుండగా, మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి నుంచి మంత్రి కేటీఆర్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేసినట్లు సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ శనివారం తెలిపారు. ఎల్‌ఓసీ మంజూరుకు కృషిచేసిన మంత్రితో పాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు బాధిత కుటుంబ సభ్యులు, సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికుడికి ఆర్థికసాయం

సిరిసిల్ల అర్బన్ : తాటి చెట్టు పైనుంచి పడి గాయపడిన గీత కార్మికుడు ఉట్కూరి రవీందర్ గౌడ్‌కు గోపా ఆర్థిక సాయం అందించింది. జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ గౌడ్, కోశాధికారి బాలరాజ్ గౌడ్, తదితరులున్నారు.

యువతి వివాహానికి..

సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దబోనాలకు చెందిన బర్ల దుర్గయ్య-రాజవ్వ కూతురు వివాహం సందర్భంగా 22 బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు పంగ మధుకర్ రూ. 5వేలు ఆర్థికసాయంగా అందజేశారు. అంబేద్కర్ యువజన సంఘం, యూత్ సభ్యులు, తదితరులున్నారు.

సమస్యలను అధిగమించాలి

ఎల్లారెడ్డిపేట: ప్రతీ వ్యక్తి జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి మానసిక ప్రశాంతతో జీవించాలని మండల వైద్యాధికారి బాబు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కిరణం సలహా కేంద్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఆత్మస్థైర్యం కోల్పోయిన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'రిజర్వేషన్లు కల్పించాలి'

సిరిసిల్లటౌన్: ముస్లిం తెగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు సైదాఖాన్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లు నాలుగుశాతం తొలగిస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ఆరోపించడం ఖండిస్తున్నామన్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'సభను విజయవంతం చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

తంగళ్లపల్లి/ ముస్తాబాద్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఈనెల 8న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ యువ సంఘర్షణ బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఆయా మండలకేంద్రాల్లో శనివారం మాట్లాడుతూ..నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, గెలిచాక నిరుద్యోగులను, ఉద్యోగులను పట్టించుకోవడం లేదని, హామీలను నెరవేర్చాలన్నారు. కొలువులు లేక నిరుద్యోగులు ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. దరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే యువ సంఘర్షణ సభకు యువత, నిరుద్యోగులు వేలాదిగా తరలిరావాలని ఆయా మండలాల నుంచి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.